సాక్షి
జనగామ
శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



ఆర్టీసీలో భద్రతకు పెద్దపీట
టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం రోడ్డు భద్రతకు ప్రాధాన్యం ఇస్తోంది. రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు పోతోంది. - 8లో▸



మేడారం పనులు పూర్తిచేయాలి
మేడారం మహాజాతర అభివృద్ధి పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. జాతర పనులు భక్తులకు సంతృప్తికరంగా ఉండాలన్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
29^0 /23^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్న సమయంలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రి వరకూ కొనసాగవచ్చు.

న్యూస్‌రీల్

పీఏసీఎస్ ఇన్‌చార్జ్‌లకు బాధ్యతల అప్పగింత



వి.వేణుగోపాల్, కళ్లెం సొసైటీ



బి.దివ్య, బచ్చన్నపేట సొసైటీ



ఎన్.కొర్నేలియస్, నిడిగొండ సొసైటీ

జనగామ: జిల్లాలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలకు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు జిల్లా సహకార అధికారి కోదండరాములు గురువారం చెప్పారు. లింగాలఘణపురం మండలం కళ్లెం సొసైటీ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా వి.వేణుగోపాల్ (కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్), బచ్చన్నపేట సొసైటీ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా బి.దివ్య(కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్), రఘునాథపల్లి నిడిగొండ సొసైటీ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఎన్.కొర్నేలియస్ (కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్)లకు బాధ్యతలను అప్పగించారు. జఫర్‌గఢ్ సొసైటీకి సంబంధించిన నిర్ణయాన్ని పెండింగ్‌లో ఉంచారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జనగామ రూరల్: ఈనెల 13వ తేదీన జిల్లా కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ గురువారం ఒక ప్రకటన తెలిపారు. ఇంతకు ముందు కోర్ట్ ముందుకు రాని కేసులు, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు కానీ పరిష్కరించుకునే వీలు ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, డబ్బు రికవరీకి సంబంధించిన కేసులు, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, చిట్ ఫండ్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు పరిష్కరించుకోవచ్చుని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రొసీడింగ్ కాపీలు ఇవ్వాలి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎల్ఆర్ఎస్ కట్టిన బాధితుల ధర్నా



జనగామ రూరల్: ప్రభుత్వ నిబంధన ప్రకారం ఎల్ఆర్ఎస్ కట్టిన బాధిత ప్లాట్ ఓనర్లకు ఎల్ఆర్ఎస్ అప్రూవల్ ఆర్డర్ కాపీ ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం బాధితులతో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..పట్టణంలోని 400 సర్వే నెంబర్ ఇళ్ల స్థలాల భూమిలో ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ అయ్యి పునాది లెవెల్ పూర్తి చేసిన గాజుల అంజలికి ఇందిరమ్మ ఇల్లు బిల్లు విడుదల చేయాలన్నారు. 2006 సంవత్సరంలో పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ ఎండీ ఇబ్రహీం భూమిని ప్లాట్లు చేసి విక్రయించగా పేదలు, రిక్షా కార్మికులు, హమాలీ కార్మికులు తదితరులు కొనుక్కొని ఎవరి ఖబ్జా మీద వారు ఉన్నారన్నారు. ధర్మ కృష్ణారెడ్డి అనే భూస్వామి 383 సర్వే నెంబర్లు పట్టా కలిగి ఉండి అక్రమంగా 400 సర్వే నెంబర్ పట్టాలోకి చొరబడి పేదలను ఇబ్బంది పెడుతున్నాడని, ఈ విషయం 2024 సంవత్సరంలో జనగామ డీఐ సర్వే నిర్వహించి గెట్టు నిర్ణయించారని మున్సిపల్ అధికారులను తప్పుదారి పట్టించి పేదలను ఇబ్బంది పెడుతున్నాడన్నారు. తక్షణమే పేదలకు న్యాయం చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఇ ర్రి అహల్య, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, ఎండీ అజారుద్దీన్, భూక్య చందు, మీట్యానాయక్, బొట్ల శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



పునఃసమీక్షించాలని ఉపాధ్యాయుల విన్నపాలు

- సుప్రీంకోర్టు తీర్పుతో డైలమా
- సీనియర్ ఉపాధ్యాయులను పరీక్ష రాయమనడం భావ్యం కాదు..
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ వేయాలని విజ్ఞప్తి

టెట్.. టెన్షన్

జనగామ: ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ ×టెన్షన్ పట్టుకుంది. ఈనెల 1వ తేదీన సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఉలిక్కి పడేలాచేసింది. ఐదేళ్లకు పైబడి సర్వీస్ ఉన్న ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు రెండేళ్లలోపు టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) అర్హత పరీక్షలో ఉత్తీర్ణులు కాని పక్షంలో ఉద్యోగాన్ని వదులుకోవాల్సిందేనని తీర్పు స్పష్టం చేస్తోంది. ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన తర్వాత తమ జీవితాన్ని విద్యారంగానికి అంకితం చేసిన టీచర్లను తక్షణమే పరీక్ష రాయాలని, లేకుంటే ఉద్యోగం కోల్పోవాలనే నిర్ణయం అన్యాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

టెట్ చట్టబద్ధతపై 2010 నోటిఫికేషన్ నేపథ్యం

టెట్ అర్హతపై 2010 ఆగస్టు 23న నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీఈటీ) కీలక నోటిఫికేషన్ జారీ చేసింది. ఉపాధ్యాయ నియామకానికి టెట్ ఉత్తీర్ణత తప్పనిసరిగా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. జీవో జారీకి ముందు పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చింది. 2010కు ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులు ఈ పరీక్ష నుంచి తప్పించబడ్డారు. ఈ నోటిఫికేషన్ ఆధారంగానే గత పదిహేనేళ్లుగా పాలక ప్రభుత్వాలు ఉపాధ్యాయ నియామకాలు చేస్తున్నాయి.

రెండేళ్ల గడువుతో టీచర్లలో ఆందోళన

రెండేళ్లలోపు టీచర్లు టెట్‌లో అర్హత సాధించాలని సుప్రీంకోర్టు ఆదేశం ఉపాధ్యాయుల్లో ఆందోళన కలిగిస్తోంది. కొంతమంది సీనియర్లు దశాబ్దాల తరబడి పాఠశాలల్లో బోధన చేస్తున్నారు. ఇప్పుడు వయసు, ఆరోగ్య సమ స్యలు, ఇంటి బాధ్యతలు వంటి కారణాలతో మళ్లీ పరీక్షకు సిద్ధమవ్వడం కష్టమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి లక్షలాది మంది ఉపాధ్యాయులు టెట్ పరీక్షకు హాజరు కావాల్సి వస్తే నిర్వహణకు సంబంధించిన సమస్యలు ఎదురవుతాయని విద్యావేత్తలు భావిస్తున్నారు.

రివ్యూ పిటిషన్‌కు డిమాండ్

టెట్ అర్హత.. వద్దే వద్దంటూ ఉపాధ్యాయ సంఘాలు, నిపుణులు ఒకే స్వరం వినిపిస్తున్నారు. సుప్రీం కోర్టు తీర్పును పునఃసమీక్షించాలని కోరుతున్నారు. 2010 నోటిఫికేషన్ కంటే ముందు నియమితులైన టీచర్లకు మినహాయింపు కొనసాగించాలనే వాదన బలంగా వినపడుతోంది. విద్యారంగంలో అనుభవమే గొప్ప అర్హత అని, సీనియర్ టీచర్ల బోధన నైపుణ్యాలను కేవలం టెట్ పరీక్షతో కొలవలేమనే వాదన ఉంది. అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సీనియర్ టీచర్ల రక్షణ బాధ్యత ప్రభుత్వాలదే

సీనియర్ టీచర్ల ప్రయోజనాలను కాపాడటం అత్యవసరం. వారు ఇప్పటివరకు నిస్వార్థంగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు. అలాంటి వారికి హఠాత్తుగా పరీక్ష బారిన పడేలా చేయడం సరైన నిర్ణయం కాదని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఉపాధ్యాయుల తరఫున నిలబడాలని కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా విద్యహక్కు చట్టం (ఆర్‌టీఈ) అమలు పరంగా ఉపాధ్యాయ నియామకానికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి, గందరగోళం తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యా నాణ్యతను కాపాడేందుకు నిర్ణయాలు తీసుకోవాలే తప్ప, సీనియర్ ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేయడం తగదని ఉపాధ్యాయ వర్గంలో చర్చ కొనసాగుతోంది.

జిల్లాలో 2,119 మంది టీచర్లు

జిల్లాలో గెజిటెడ్, పీఎస్ హెచ్ఎంలతో పాటు స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, పండిట్లు, ఇతర కేటగిరీల పరిధిలో 2,119 మంది టీచర్లు ఉన్నారు. ఇందులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వచ్చే రెండేళ్ల లోపు సుమారు 850 మంది టీచర్ల వరకు టెట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది.

సుప్రీం తీర్పును సమీక్షించాలి



రెండేళ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉత్తీర్ణులు కావాలని, లేదంటే ఉద్యోగాన్ని వదులుకోవాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలి. ప్రస్తుతం పదోన్నతి పొందాలంటే టెట్ అవసరమా లేదా అనే వివాదంపై వివిధ కోర్టులో కేసులు నడుస్తున్నాయి. ఇరవై, పాతికేళ్లుగా సర్వీసు చేస్తున్న ఉపాధ్యాయులు ఇప్పుడు కేవలం రెండేళ్లలో టెట్ ఉత్తీర్ణులు కావాలనడం భావ్యం కాదు. ఎన్‌సీటీఈ నోటిఫికేషన్ తర్వాత నియామకమైన టీచర్లకు మాత్రమే టెట్ తప్పనిసరి చేయాలి.

- పి.చంద్రశేఖర్‌రావు, జిల్లా అధ్యక్షుడు, టీఎస్ యూటీఎఫ్

ఉపాధ్యాయులకు శరాఘాతమే



2009 తర్వాత నియమించబడిన ఉపాధ్యాయులు వచ్చే రెండు సంవత్సరాల్లో టెట్ ఉత్తీర్ణత పొందకపోతే, ఉద్యోగం కొనసాగించలేరని, ప్రమోషన్లకు అర్హత ఉండదని సుప్రీంకోర్టు నిర్ణయం విద్యా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని, న్యాయ నిపుణులతో సంప్రదించి, తీర్పును సవాల్ చేసి, ఉపాధ్యాయులకు మేలు చేకూర్చే విధంగా నిర్ణయం తీసుకోవాలి.

- రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయూ

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం మండలంలోని చౌడారం మోడల్ స్కూల్, కేజీవీబీని గురువారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలను తొలగించాలని, శానిటేషన్ నిర్వహించాలన్నారు. 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు రావాలంటే ఇప్పటి నుంచే ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధీర్‌రెడ్డి, అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

భూభారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

భూభారతి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో భూభారతి, సాదాబైనామా, జాతీయ కుటుంబ లబ్ధి పథకం, ప్రజావాణి దరఖాస్తులపై అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, ఆర్డీఓలు గోపిరామ్, వెంకన్నతో కలిసి తహసీల్దార్లతో సమీక్షించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. భూ భారతి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించడంలో తహసీల్దార్‌లు సందేహాలను నివృత్తి చేస్తూ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. యూరియా పంపిణీ సక్రమంగా జరిగే విధంగా విస్తృతంగా తనిఖీలు చేయాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

చెత్త డంపింగ్ ప్రాంతంలో ముగ్గులు



ముగ్గుల వద్ద కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

జనగామ: పట్టణంలో స్వచ్ఛత కోసం పురపాలిక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి గురువారం వార్డుల పర్యటన చేపట్టారు. శానిటేషన్ డిపార్టుమెంటు గోపయ్య, పులిశేఖర్‌తో కలిసి పోలీస్‌స్టేషన్ ఏరియాతో పాటు తదితర ప్రాంతాలను పరిశీలించారు. పీఎస్ మలుపు వద్ద నిత్యం చెత్తడంప్‌తో దుర్గంధంగా మారగా, కమిషనర్ ప్రత్యేక చొరవతో శుభ్రం చేయించారు. శానిటేషన్ కార్మికులు ఆ ప్రాంతంలో ముగ్గులు వేసి స్వచ్ఛతగా చేయగా, ఇక్కడ చెత్త వేసిన వారికి రూ.1000 జరిమానా అంటూ బోర్డు ఏర్పాటు చేశారు.

స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు

- కలెక్టర్ ఆదేశాలు.. మూడు టీములు ఏర్పాటు
- లోపాలు ఉన్న సెంటర్ల నిర్వాహకులకు నోటీసులు

జనగామ: జిల్లా కేంద్రంలోని స్కానింగ్ సెంటర్లలో అధికారుల బృందం గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టింది. లింగనిర్ధారణ చేస్తున్నారా.. నియమ నిబంధనలు పాటిస్తున్నారా..తదితర విషయాలను తెలుసుకునేందుకు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశాల డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లికార్జున్ రావు, డీసీపీ రాజమహేంద్రనాయక్ నేతృత్వంలో వైద్య ఆరోగ్య, పోలీసు శాఖ సంయుక్తంగా మూడు బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని న్యూవిజయ స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్, జనని స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్, లక్ష్మి స్కానింగ్ సెంటర్, లోటస్ మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్, సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీ సత్య స్కానింగ్ సెంటర్, శ్రీ వెంకటేశ్వర స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు.

స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ పీసీ, పీఎన్‌డీటీ యాక్టు ప్రకారం అనుమతులు, తదితర రికార్డులను చెక్ చేశారు. రిజిస్ట్రేషన్ సమయంలో అనుమతి పొందిన రేడియాలజిస్ట్ అందుబాటులో ఉన్నారా లేదా అనే దానిపై ఆరా తీశారు. లింగ నిర్ధారణకు సంబంధించి సైన్ బోర్డులు, స్కానింగ్ యంత్రాల వివరాలు, ధరల పట్టిక వివరాలకు స్కానింగ్ సెంటర్లకు వచ్చే వారికి కనిపించే విధంగా ప్రదర్శించారా లేదా అని చూశారు. స్కానింగ్ రేడియాలజిస్ట్, స్కానింగ్ యంత్రాలలో మార్పులు చేర్పులు చేసిన సమయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో తప్పకుండా నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ప్రతీ నెల 5వ తేదీ లోపు ఫారం ఎఫ్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి డీఎంహెచ్ఓ కార్యాలయంలో సమర్పించాలని చెప్పారు. స్కానింగ్ సెంటర్‌లలో జరుగుతున్న లోపాలను స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చి తగు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో 28 స్కానింగ్ సెంటర్ ఉండగా, మొదటి రోజు 7 చోట్ల తనిఖీలు చేపట్టామన్నారు. తనిఖీల్లో ఏఎస్పీ పండేరీ చేతన్ నితిన్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ కమల్‌హసన్, సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు బి.రాజేశ్, చెన్నకేశవులు, నరసయ్య తదితరలు పాల్గొన్నారు.



తనిఖీలో రికార్డులను పరిశీలన చేస్తున్న డీఎంహెచ్ఓ, డీసీపీ, పక్కన ఏఎస్పీ

హోంలోన్‌కు బీమా వర్తించదంటున్నారు..

- ఫైనాన్స్ బ్యాంకు ఎదుట పెట్రోల్ డబ్బాతో బాధితుల నిరసన

జనగామ: జిల్లా కేంద్రంలోని ఓ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు సంస్థ ఎదుట ఇద్దరు వ్యక్తులు గురువారం పెట్రోల్ డబ్బాతో నిరసన తెలిపారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్మెటకు చెందిన కొలేపాక లక్ష్మయ్య అనే వ్యక్తి సదరు సంస్థలో రూ.8.50లక్షల హోంలోన్ తీసుకున్నాడు. రుణం ఇచ్చే సమయంలో ఆరోగ్య పరీక్షలు చేసి, బీమా కోసం రూ.30 వేలు తీసుకున్నారు. లక్ష్మయ్య ఇటీవల మృతి చెందారు. లక్ష్మయ్య పేరిట బీమా చేసిన సమయంలో ఏదైనా జరిగితే లోన్‌కు సంబంధించిన ఫైనాన్స్ సంస్థకు ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదని నిర్వాహకులు చెప్పారని బాధితులు కన్నీరు మున్నీరుగా విలపించారు. గత నెల నుంచి బీమా వర్తించడం లేదని, లక్ష్మయ్య తీసుకున్న రుణం చెల్లించాలని సంస్థ ప్రతినిధులు బెదిరింపులకు దిగడంతో పెట్రోల్ డబ్బాతో నిరసన తెలిపామన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకుని వారికి నచ్చజెప్పి పీఎస్‌కు తీసుకెళ్లారు.



పెట్రోల్ డబ్బాతో నిరసన తెలుపుతున్న వ్యక్తులు

భావ ప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు సరికాదు!



ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం వచ్చాక పత్రికా స్వేచ్ఛ, ప్రశ్నించే గొంతులను భౌతికదాడులతో పాటు పోలీసులను ఉపయోగిస్తూ తప్పుడు కేసులతో తీవ్ర అణచివేతకు గురిచేస్తుండడంపై పాత్రికేయులు, పాత్రికేయ సంఘాలు మండిపడుతున్నాయి. ప్రజా సమస్యలపై కథనాలు ప్రచురిస్తే సాక్షి దినపత్రిక జర్నలిస్టులపై కొందరు ప్రభుత్వ ఉద్యోగులతో ఫిర్యాదులు ఇప్పిస్తూ కేసులు నమోదు చేస్తుండడాన్ని ఖండించారు. వివిధ అంశాలపై ప్రతిపక్ష పార్టీల నాయకులు ఏర్పాటు చేసే ప్రెస్‌కాన్ఫరెన్స్‌ల వార్తలు రాసిన సందర్భంలోనూ సాక్షి దినపత్రికతో పాటు ఎడిటర్, ఇతర జర్నలిస్టులపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛను పూర్తిగా తమ గుప్పిట్లోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - హన్మకొండ

పత్రిక కార్యాలయాలపై దాడులు అప్రజాస్వామికం



ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన జర్నలిస్టులపై కేసులు పెట్టడం అప్రజాస్వామికం. తప్పుడు వార్త రాస్తే ఖండన ఇవ్వాలి. అలాకాకుండా పత్రిక కార్యాలయాలపై దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య. ఇది పత్రికా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టు. దాడులు, అక్రమ కేసులను ప్రజాస్వామ్యవాదులు, సామాజికవేత్తలు, మేధావులు ఖండించాలి. కేసులు ఎత్తివేయాలి.

- దాసరి కృష్ణారెడ్డి, ఐజేయూ నాయకుడు

సాక్షి ఎడిటర్‌పై కేసులు ఎత్తివేయాలి



సాక్షి ఎడిటర్‌పై పెట్టిన కేసును బేషరతుగా ఎత్తివేయాలి. రాజకీయాలకు, జర్నలిజానికి లింక్ పెట్టడం సమంజసం కాదు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛకు ప్రభుత్వం అడ్డంకులు సృష్టించవద్దు. ఏపీ ప్రభుత్వం వాస్తవాలు గ్రహించి అక్రమ కేసులు ఎత్తివేయాలి. ఫ్రీడం ఆఫ్ ది ప్రెస్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిరక్షించాలి. ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తున్నాం. జర్నలిస్టులపై కేసులు అప్రజాస్వామికం.

- బొక్క దయాసాగర్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి

కేసులు పెట్టడం దుర్మార్గం..



పత్రికా కార్యాలయాలపై దాడులు, ఎడిటర్‌పై కేసులు పెట్టడం పత్రికా స్వేచ్ఛకు కళ్లెం వేయడమే. సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డిపై కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నాం. ఇలాంటి ధోరణి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టువంటిది. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హరించివేస్తోంది. ఇలాంటి చర్యలు ప్రభుత్వానికి ఏ మాత్రం మంచిది కాదు. రాజకీయ కక్షలు పత్రికలపై తీర్చుకోవడం సమంజసం కాదు. ప్రెస్‌మీట్ వార్తలు ప్రచురించినందుకు కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య.

- తోట సుధాకర్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి

పత్రికాస్వేచ్ఛ చాలా ప్రధానమైంది...



ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ చాల ప్రధానమైంది. అక్రమ కేసులు పెట్టడం పత్రికా స్వేచ్ఛను హరించడమే. పత్రికా కార్యాలయాలపై దాడులు, కేసుల వంటి చర్యలు మీడియా గొంతు నొక్కివేయడమే. పత్రికలు తమ పని తాము చేసినప్పుడే సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలు ప్రజలకు చేరువవుతాయి. తద్వారా ప్రజలు చైతన్యవంతమవుతారు. సాక్షి ఎడిటర్‌పై కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నాం. ఇలాంటి చర్యలను విడనాడాలి.

- జి.ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి

దాడులు సమంజసం కాదు..



పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం సమంజసం కాదు. ప్రజల సమస్యలు వెలికి తీసి ప్రభుత్వానికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపే పత్రికలను అణచివేయాలని చూడడం దుర్మార్గం. విలేకరుల సమావేశంలో ఒక వ్యక్తి పేర్కొన్న అంశాలను ప్రచురిస్తే కేసులు పెట్టడం సహించరానిది. ఇలాంటి చర్యలు పత్రికా స్వేచ్ఛకు కళ్లెం వేయడం వంటివే.

- కర్రె భిక్షపతి, సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి

పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించొద్దు..



పత్రికా స్వేచ్ఛపై దాడులు సరికాదు. పత్రికల్లో వచ్చే ప్రతీ విమర్శపై కేసులు నమోదు చేయడం ప్రభుత్వాలకు మంచి పద్ధతి కాదు. ప్రెస్‌మీట్‌లో ఓ వ్యక్తి చెప్పిన అంశాలను ప్రచురిస్తే ఎడిటర్‌పై కేసులు పెట్టడం అత్యంత దుర్మార్గమైన చర్య. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించొద్దు. పత్రికలో ప్రచురితమైన కథనంపై అభ్యంతరాలుంటే ఖండన ఇవ్వాలి. కేసులు పెట్టడం భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించడమే.

- ఎర్ల అశోక్‌రెడ్డి, బీజేపీ నాయకుడు

హైదరాబాద్ రోడ్డును ముంచెత్తిన వరద



దంచికొట్టింది

జిల్లాకేంద్రంలో ఒక్కసారిగా భారీ వర్షం

జనగామ: జిల్లాలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండలతో వాతావరణం హీటెక్కి పోగా.. సాయంత్రం 4 గంటల నుంచి ఒక్కసారిగా చల్లబడింది. 5.30 గంటల ప్రాంతంలో ముసురుతో ప్రారంభమైన వాన.. కనీవినీ ఎరగని స్థాయిలో దంచికొట్టింది. దీంతో జిల్లా కేంద్రంలోని హైదరాబాద్‌రోడ్డుతో పాటు జ్యోతినగర్, బాలాజీనగర్, కుర్మవాడ, శ్రీనగర్ కాలనీ రూట్, చమన్ తదితర ఏరియాలను వరద ముంచెత్తింది. చమన్ ఏరియాలో ఆరుబయట ఉంచిన బైక్‌లు సగం వరకు మునిగిపోగా, హైదరాబాద్ రూట్‌లో దుకాణ షట్టర్ల వరకు వరద చేరడంతో వ్యాపారులు ఆందోళన చెందారు. చంపక్‌హిల్స్‌లో పెంబర్తి బైపాస్ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉండడంతో రోడ్డును ముంచేయడంతో వాహనాలు అందులో ఇరుక్కుపోయాయి. సీఐ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, అజారుద్దీన్, ఆవుల శ్రీనివాస్‌రెడ్డి రోడ్డును సందర్శించారు. కాంట్రాక్టర్, ఎస్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. గానుగుపహాడ్ బ్రిడ్జి వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలో రాత్రి 9 గంటల వరకు 40.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. జిల్లాలోని బచ్చన్నపేటలో అత్యధికంగా 113.8 మిల్లీమీటర్లు, జనగామలో 94.0 మి.మీ., రఘునాథపల్లిలో 82.8, లింగాలఘణపురంలో 71.8, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 69.3, తరిగొప్పులలో 48, జఫర్‌గడ్‌లో 34, పాలకుర్తిలో 26, నర్మెటలో 9.5, దేవరుప్పులలో 9.3, కొడకండ్లలో 5.5 మి.మీ వర్షం కురిసింది.





దుకాణాల షట్టర్ల వద్దకు వరద నీరు

ఆర్టీసీలో భద్రతకు పెద్దపీట..

- సేఫ్టీ వార్డెన్స్ ద్వారా నిత్య పరిశీలన
- మారుతున్న డ్రైవర్ల జీవన శైలి
- తగ్గుతున్న ప్రమాదాలు
- వరంగల్ రీజియన్‌లో 9 డిపోలు



సేఫ్టీ వార్డెన్స్



హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం రోడ్డు భద్రతకు ప్రాధాన్యమిస్తోంది. రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు పోతోంది. డ్రైవర్ ఆరోగ్యంగా ఉండి, మంచి నడవడిక, ఆరోగ్యకరమైన జీవన శైలి ఉంటే, మానసికంగా దృఢంగా ఉంటారని... తద్వారా ప్రమాదాలు అరికట్టవచ్చనే ఆలోచనతో వరంగల్ రీజియన్ ముందుకు పోతోంది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సేఫ్టీ వార్డెన్లను నియమించారు. ప్రమాదాలు చేయని, అనుభవజ్ఞులు, సత్ప్రవర్తన, ఎలాంటి దురలవాట్లు లేని డ్రైవర్లు, కండక్టర్లను సేఫ్టీ వార్డెన్లుగా ఎంపిక చేశారు. వరంగల్ రీజియన్‌లో 9 డిపోలకు ఒకరి చొప్పున నియమించారు.

సేఫ్టీ వార్డెన్ల విధులు..

సేఫ్టీ వార్డెన్లు డ్రైవర్లను ప్రతీరోజు నిశిత పరిశీలన చేస్తారు. సెలవులో ఉన్న వారిని వదిలిపెట్టరు. వారి ఆరోగ్యాన్ని, జీవనశైలిని దగ్గరగా గమనిస్తారు. వారాంతపు సెలవు రోజులు, స్పెషల్ ఆఫ్‌లో ఉన్న సమయంలో తగిన విశ్రాంతి తీసుకుంటున్నారా..? మద్యం సేవిస్తున్నారా..? ఇతర దురలవాట్లకు పాల్పడుతున్నారా.. అనారోగ్యంగా ఉంటే అవసరమైన మందులు సమయానుకూలంగా వాడుతున్నారా.. తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. డ్రైవర్ల కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్లు తీసుకుని విశ్రాంతి రోజు వారి జీవన విధానాన్ని గమనిస్తున్నారు. వారి నడవడిక, ప్రవర్తనలో ఏ మాత్రం తేడా వచ్చినా డిపో, రీజియన్ అధికారులకు వివరించి సన్మార్గంలో నడిచేలా చూస్తారు. ఇలా చేయడం ద్వారా డ్రైవర్లు ఆరోగ్యంగా ఉంటారని, ఎలాంటి అలజడులకు తావు లేకుండా మానసికంగా ఉంటారని అధికారులు తెలిపారు. వరంగల్ రీజియన్‌లో సంస్థ డ్రైవర్లు 1100, ఎలక్ట్రిక్ బస్ డ్రైవర్లు 258 మంది ఉన్నారు.

డిపోల వారీగా సేఫ్టీ వార్డెన్ల నియామకం..

ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో సేఫ్టీ వార్డెన్లను డిపో వారీగా నియమించారు. వరంగల్–1కు ఎంఎం రావు, వరంగల్–2 డిపోకు ఎస్.బాబురావు, హనుమకొండ డిపోకు ఎ.శ్రీనివాస్‌రెడ్డి, జనగామ డిపోకు సురేందర్, పరకాల డిపోకు శంకరయ్య, భూపాలపల్లి డిపోకు రమేశ్, తొర్రూరు డిపోకు యాకూబ్‌రెడ్డి, నర్సంపేట డిపోకు బాబు, మహబూబాబాద్ డిపోకు నర్సయ్యను సేఫ్టీ వార్డెన్లుగా నియమించారు.

డిపోల వారీగా డ్రైవర్ల వివరాలు

డిపో	డ్రైవర్లు
హనుమకొండ	199
వరంగల్–1	286
వరంగల్–2	19
పరకాల	90
జనగామ	172
తొర్రూరు	120
మహబూబాబాద్	83
నర్సంపేట	121
భూపాలపల్లి	119

ఉద్యోగులు, కార్మికులకు వైద్య పరీక్షలు..

గ్రాండ్ హెల్త్ చాలెంజ్ కార్యక్రమం ద్వారా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు యాజమాన్యం వైద్య పరీక్షలు నిర్వహించింది. వారి ఆరోగ్యాన్ని బట్టి ఉద్యోగులకను కేటగిరీలుగా విభజించింది. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయించింది. హెల్త్ డేటా బేస్‌లో ఉద్యోగి వారీగా ఆరోగ్యానికి సంబంధించిన సమగ్ర సమాచారం పొందుపరిచారు. వైద్య పరీక్షల ఆధారంగా నాలుగు కేటగిరీలుగా విభజించారు. మందులు వాడుతున్నారా లేదా అని సేఫ్టీ వార్డెన్లు నిశితంగా పరిశీలిస్తున్నారు. విధులకు వచ్చిన సందర్భంలోనూ వారి వ్యక్తిగత రికార్డులు పరిశీలించి వాడాల్సిన ఔషధాలు వెంట తెచ్చుకున్నారా లేదా అని తెలుసుకుంటున్నారు. అదేవిధంగా భోజనం, తాగునీరు కూడా ఇంటి వద్ద నుంచి తెచ్చుకునేలా మార్గదర్శనం చేస్తున్నారు. నైట్ డ్యూటీకి వెళ్లే వారు, రెస్ట్‌లో ఉండే వారు దోమతెర, ఓడోమస్ వెంట తీసుకొచ్చేలా వారిని ప్రోత్సహిస్తున్నారు. తద్వారా డ్రైవర్ల ఆరోగ్యం బాగుండడంతోపాటు రోడ్డు ప్రమాదాలు తగ్గుతున్నాయని అధికారులు తెలిపారు.

వ్యక్తిగత రికార్డుల పరిశీలన..

డ్రైవర్ల పనితీరుపై కూడా వ్యక్తిగత రికార్డులు నిర్వహిస్తున్నారు. డ్రైవర్ ఉద్యోగంలో చేరిన తేదీ, ప్రవర్తన తీరు.. ప్రమాదాలు జరిగాయా.. జరిగితే ప్రమాదానికి కారణం ఎవరు.. మామూలు ప్రమాదమా, మేజర్ ప్రమాదమా.. ప్రాణాలుపోయిన ప్రమాదమా వంటి వివరాలు నమోదు చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సురక్షిత డ్రైవింగ్ చేసే డ్రైవర్లను 'ఏ' కేట గిరీలో, మైనర్ ప్రమాదాలు చేసిన వారిని 'బి' కేట గిరీ, మేజర్ ప్రమాదాలకు పాల్పడిన వారిని 'సి' కే టగిరి, ప్రమాదంలో ప్రాణాలు పోతే 'డి' కేటగిరీలో చేర్చారు.

సేఫ్టీ వార్డెన్లతో సత్ఫలితాలు..



సేఫ్టీ వార్డెన్ల నియామకం సత్ఫలితాలనిస్తోంది. డ్రైవర్లు వ్యసనాలు, దురలవాట్లకు దూరమవుతున్నారు. మానసికంగా దృఢంగా తయారై సురక్షిత డ్రైవింగ్ చేస్తున్నారు. తద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గుతున్నాయి. గత సంవత్సరంలో చూసుకుంటే గడిచిన నాలుగు నెలల కాలంలో 8 ఫ్యాటల్ ఆక్సిడెంట్లు తగాయి. గతేడాది నాలుగు నెలల కాలంలో 19 ఫ్యాటల్ ఆక్సిడెంట్లు జరుగగా ఈ ఏడాది 11 ఫ్యాటల్ ఆక్సిడెంట్లు జరిగాయి. 11 ప్రమాదాల్లో మూడు మాత్రమే సంస్థ, సంస్థ అద్దెకు తీసుకున్న డ్రైవర్ల పొరపాటుతో జరిగాయి. మిగతా ప్రమాదాలు ఇతరుల తప్పిదాలతో జరిగాయి.

డి.విజయభాను, రీజినల్ మేనేజర్, వరంగల్

వృద్ధురాలి దారుణ హత్య..

- గొడ్డలితో నరికి చంపిన అల్లుడు
- మద్యం మత్తులో డబ్బుల కోసం ఘాతుకం
- వీఆర్‌కేపురంలో ఘటన



ఎల్లమ్మ (ఫైల్)

వెంకటాపురం(కె): వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. మద్యం మత్తులో డబ్బుల కోసం అల్లుడు గొడ్డలితో నరికి చంపాడు. ఈ ఘటన ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం వీఆర్‌కేపురంలో చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతిరావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండగొర్ల ఎల్లమ్మ (65) భర్తను వదిలి తల్లిదండ్రులతో కలిసి జీవనం కొనసాగిస్తోంది. ఎల్లమ్మ రోజువారీగా కూలీ పనులు చేసుకుంటూ కొంతమేర డబ్బులు దాచుకుంది. ఈ డబ్బులపై తన అన్న కుమారుడు విజయ్ కన్నేశాడు. మద్యానికి బానిసైన విజయ్.. డబ్బులు, బంగారం కావాలని మూడు రోజులుగా మేనత్త ఎల్లమ్మను అడుగుతుండగా ఆమె నిరాకరిస్తోంది. దీనిపై విజయ్ కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఎల్లమ్మ గురువారం ఉదయం ఇప్పలగూడెంలోని కిరాణా షాపునకు వెళ్తోంది. ఈ సమయంలో మద్యం మత్తులో ఉన్న విజయ్ తనకు డబ్బులు ఇవ్వడం లేదనే కోపంతో ఎల్లమ్మపై గొడ్డలితో దాడికి పాల్పడగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి సోదరి బాడిస దుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తిరుపతిరావు తెలిపారు. కాగా, ఎల్లమ్మ హత్యతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు.

ఉద్రిక్తంగా మారిన ఏబీవీపీ ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు

- కలెక్టరేట్ ముట్టడికి యత్నం
- సీఎంను విమర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని ధర్నా



నిరసనకారులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

హన్మకొండ అర్బన్: విద్యార్థుల పెండింగ్ ఉపకార వేతనాలు చెల్లించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. ముఖ్యమంత్రిని విమర్శిస్తూ నినాదాలతో హోరెత్తిన ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు కలెక్టరేట్ లోకి చొచ్చుకు వెళ్లేందుకు యత్నించారు. కలెక్టరేట్ గేట్‌ను తోసుకుని, గేట్లు ఎక్కి లోపలికి దిగేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో పోలీసులు విద్యార్థి సంఘాల నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాటలు జరిగాయి. ఆందోళన చేస్తున్న కార్యకర్తలను పోలీసులు ఈడ్చుకెళ్లి వాహనాల్లో ఎక్కించారు. పోలీసులు ఎంత ప్రయత్నించినా సుమారు గంటకుపైగా ఆందోళన కొనసాగింది. ఈసందర్భంగా ఏబీవీపీ వరంగల్ విభాగ్ కన్వీనర్ ఆరెపల్లి సుజిత్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి విద్యార్థులు గుర్తుకొస్తారని ఆరోపించారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయకపోతే సీఎం, మంత్రులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కన్వీనర్ దూళిపూడి హరిచరణ్, వరంగల్ మహానగర్ కార్యదర్శి బెల్లం కార్తీక్, రోహిత్, రాహుల్, నవీన్, త్రినేష్, అభిలాష్, శ్రీకాంత్, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- నలుగురి అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వరంగల్ క్రైం : పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ మేకల రంజిత్‌కుమార్ గురువారం తెలిపారు. సుబేదారి పీఎస్ పరిధి జులైవాడలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ చేయగా నలుగురు పట్టుబడ్డారు. దీంతో నిందితుల నుంచి రూ. 1.04 ల క్షలు స్వాధీనం చేసుకుని జులైవాడకు చెందిన భూక్యా రవి, గుండ్లసింగారానికి చెందిన మాలోత్ రాజు, రాయపర్తికి చెందిన హలావత్ వినోద్, అదాలత్‌కు చెందిన నూనవత్ తిరుపతిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఎస్సై రామారావు, కానిస్టేబుళ్లు మారేపల్లి ప్రభాకర్, అఖిల్, ప్రమోద్‌ను ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ అభినందించారు.

రేపటినుంచి 8 ప్రత్యేక రైళ్లు

కాజీపేట రూరల్ : పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం కాజీపేట జంక్షన్ మీదగా చర్లపల్లి–అనకాపల్లి మధ్య 8 ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ గురువారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు..

ఈ నెల 13 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు చర్లపల్లి–అనకాపల్లి (07035) ఎక్స్‌ప్రెస్ ప్రతీ శనివారం కాజీపేటకు చేరుకుని వెళ్తుంది. అదేవిధంగా ఈ నెల 14 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు అనకాపల్లి–చర్లపల్లి (07036) ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమవారం కాజీపేటకు చేరుకుని వెళ్తుంది. ఈ రైళ్ల సర్వీస్‌లకు కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, రాయన్‌పాడ్, ఏలూరు, తాడేపల్లి గూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించినట్లు సీపీఆర్వో తెలిపారు.

పలువురు ఆర్‌ఎంపీలపై కేసు నమోదు

హసన్‌పర్తి: అర్హత లేకుండా అల్లోపతి వైద్యం చేస్తున్న పలువురు ఆర్‌ఎంపీలపై కేసులు నమోదయ్యాయి. మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ లాలయ్య కథనం ప్రకారం.. కేయూసీ క్రాస్ రోడ్డులో ఆర్‌ఎంపీ హెచ్.వెంకట్‌రెడ్డి, ఇంతేజార్‌గంజ్ పీఎస్ పరిధిలోని ఆర్‌ఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి ఈశ్వరయ్య ఎలాంటి అనుమతులు లేకుండా ఇంజెక్షన్లు ఇవ్వడం, సెలైన్ పెట్టడం, బెడ్స్ ఏర్పాటు, ల్యాబ్ పరీక్షలు నిర్వహిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై కేసులు నమోదయ్యాయి. అలాగే, గోపాలపురంలో అబ్దుల్ షరీఫ్ కూడా అల్లోపతి వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. ఇక నుంచి తాను ఎలాంటి వైద్య సేవలు అందించనని లిఖితపూర్వకంగా అఫిడవిట్ ఇవ్వడంతో అతడిపై ఫిర్యాదును ఉపసంహరించుకున్నారు.

రూ.5 లక్షల జరిమానా..

కాగా, అర్హతలేకుండా వైద్య సేవలు అందించే ఆర్‌ఎంపీలపై రూ.5లక్షలు జరిమానా విధిస్తామని పబ్లిక్ రిలేషన్‌కమిటీ చైర్మన్ నరేశ్‌కుమార్ తెలిపారు. అలాగే జైలు శిక్షణ కూడా పడుతుందని చెప్పారు.

విషజ్వరంతో వ్యక్తి మృతి

మల్హర్: విషజ్వరంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మల్హర్ మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎడ్లపల్లి గ్రామానికి చెందిన వెంకటి (55) కొంతకాలంగా జ్వరంతో బాధపడుతున్నడున్నాడు. భూపాలపల్లిలో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, పరిస్థితి విషమించడంతో వెంకటి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

మహాజాతర పనులు సకాలంలో పూర్తి చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర టీఎస్, పక్కన ఎస్పీ శబరీశ్, ఇతర అధికారులు

- పనులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలి
- కలెక్టర్ దివాకరటీఎస్

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మేడారం మహాజాతర అభివృద్ధి పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ దివాకరటీఎస్ అన్నారు. గురువారం మండలంలోని మేడారం ఐటీడీఏ గెస్ట్ హౌస్‌లో ఎస్పీ డాక్టర్ శబరీశ్, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్, అడిషనల్ కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావుతో కలిసి మహాజాతర అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా చేపట్టనున్న పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర్ టీఎస్ మాట్లాడుతూ పీఆర్, ఆర్‌అండ్‌బీ, ట్రైబల్ వెల్ఫేర్, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ, అటవీశాఖ, పోలీస్, విద్యుత్‌శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించి వారంలోగా నివేదిక అందజేయాలని ఆదేశించారు. ప్రతీ శాఖకు సంబంధించి టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసిన పనులు క్షేత్ర స్థాయిలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో జరిగిన జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. సంబంధిత అధికారులు మేడారంలో క్షేత్ర స్థాయిలో ఉండాలని, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదిక అందించాలన్నారు. మహాజాతరకు సుమారు కోటి యాభై లక్షల పైగా భక్తులు హాజరవుతారని అంచనా ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో జాతర పనులు భక్తులకు సంతృప్తికరంగా ఉండాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, డీఆర్‌ఓ శ్రీనివాస్‌రావు, మేడారం ఈఓ వీరస్వామి, తహసీల్దార్ సురేశ్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు దృఢ సంకల్పంతో ముందుకు సాగాలి

- రాష్ట్ర గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి



క్రీడలను ప్రారంభిస్తున్న గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి

కొత్తగూడ: విద్యార్థులు దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని రాష్ట్ర గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలోని ఏకలవ్య గురుకులంలో గురుకులాల రాష్ట్ర స్థాయి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం ఏర్పరుచుకుని సాధనకు నిరంతరం కష్టపడాలన్నారు. విద్యతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వెలికి తీసేందుకు గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వం సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అదనపు కార్యదర్శి మాధవిదేవి, ఓఎస్‌డీలు రామారావు, శ్రీనివాస్, గంగాధర్, స్పోర్ట్స్ ఆఫీసర్ వీర్యనాయక్, ఆర్సీఓ రత్నకుమారి, ప్రిన్సిపాల్ అజయ్‌సింగ్, వివిధ పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా, ఈ పోటీలు ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు

- సీపీఆర్ చేసి కాపాడిన డ్రైవర్



ప్రమాదంలో గాయపడిన సారయ్య (షర్ట్ లేని వ్యక్తి)

హన్మకొండ అర్బన్: విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడు గాయపడిన సంఘటన గ్రేటర్ 49వ డివిజన్ పరిధిలోని దర్గా వంద ఫీట్ల రోడ్డులో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. దర్గా వందఫీట్ల రోడ్డులో ప్రావిడెంట్ ఫండ్ ఆఫీస్ ఎదుట నిర్మాణంలో ఉన్న భవనం రెండో అంతస్తులో మాలోత్ సారయ్య సెంట్రింగ్ పనిచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు 33 కేవీ విద్యుత్ లైన్‌కు ఇనుపరాడు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి రెండో అంతస్తుపై నుంచి కింద పడిపోయాడు. కుప్పకూలిన సారయ్య మరణించాడని అందరూ అనుకున్నారు. ఈ క్రమంలో పరిస్థితిని గమనించిన స్థానిక ఎక్సైజ్ ఆఫీస్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న సాంబరాజు ధైర్యంగా ముందుకు వచ్చి సారయ్యకు సీపీఆర్ చేశాడు. దీంతో కొద్దిసేపటికి సారయ్యకు స్పృహ వచ్చింది. ఆర్‌ఈసీ ఎన్పీడీసీఎల్ ఏఈ, లైన్‌ఇన్‌స్పెక్టర్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. భవన నిర్మాణ క్రమంలో సరైన జాగ్రత్తలు తీసుకోని ఇంటి యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి పత్రాలు చూపించాలని యజమానిని ఆదేశించారు. బాధితుడికి ఒక కాలు విరిగిపోవడంతోపాటు తీవ్రంగా గాయాలయ్యాయి. 108 పైలట్ బాలాజీ, ఈఎంటీ సురేందర్ బాధితుడికి ప్రథమ చికిత్స చేసి ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సీపీఆర్ చేసిన డ్రైవర్ సాంబరాజును స్థానికులు అభినందించారు.

అంతర్జాతీయ క్రీడా సదస్సుకు డీవైఎస్‌ఓ అశోక్



కలెక్టర్ స్నేహ శబరీష్ నుంచి సదస్సు ఆహ్వాన పత్రికను అందుకుంటున్న డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్: నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ సైన్స్ (ఎన్‌ఏపీఈఎస్‌ఎస్) ఆధ్వర్యంలో మలేషియాలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న మొదటి అంతర్జాతీయ క్రీడా సదస్సులో పాల్గొనేందుకు హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్‌కు ఆహ్వానం అందింది. మలేషియాలోని యూనివర్సిటీ టెక్నాలజీ మారా, షా ఆలంలో మూడు రోజులపాటు జరిగే సదస్సులో అశోక్‌కుమార్ పాల్గొననున్నారు. ఈ మేరకు ఎన్‌ఏపీఈఎస్‌ఎస్ చైర్మన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజామహ్మద్ ఫిర్దౌరాజాఅజిదిన్ ఆహ్వాన పత్రికను పంపించారు. కాకతీయ యూనివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్‌పై పీహెచ్‌డీ చేస్తున్న అశోక్‌కుమార్ సెమినార్‌లో పేపర్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు.

ఎఫ్‌ఓబీ నిర్మాణం ఎప్పుడో?

- ఎదురుచూస్తున్న ఎలక్ట్రిక్ లోకోషెడ్ రైల్వే కార్మికులు



ఎలక్ట్రిక్ లోకోషెడ్ వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లేక రైలు పట్టాలు దాటి విధులకు వెళ్తున్న కార్మికులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ (ఈఎల్‌ఎస్) వద్ద రైల్వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు నిర్మిస్తారని రైల్వే కార్మికులు అంటున్నారు. కాజీపేట జంక్షన్‌లో 2004లో రైల్వే శాఖ ఎలక్ట్రిక్ లోకో మెయిన్ షెడ్ నిర్మించింది. అప్పటి నుంచి రైల్వే అధికారులు, కార్మికులు రైలుపట్టాలు దాటి షెడ్‌కు వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం షెడ్‌లో 250 లోకోల నిర్వహణతో సుమారు 410 మంది రైల్వే కార్మికులు వివిధ సెక్షన్లలో విధులు నిర్వర్తిస్తున్నారు. షెడ్‌లోకి వెళ్లి రావాలంటే రైలు పట్టాలు దాటి వెళ్లాల్సి వస్తోంది. రన్నింగ్ ట్రైన్స్, షటింగ్ ట్రైన్స్, డీజిల్‌షెడ్, ఫిట్‌లైన్ నుంచి వచ్చి వెళ్లే రైళ్ల వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు రైల్వే కార్మికులు అంటున్నారు. ఉదయం డ్యూటీకి వెళ్లేటప్పుడు, లంచ్ టైం, డ్యూటీ అయిపోయిన తర్వాత సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో రైళ్లు వెళ్లే వరకు గేట్ వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. రైళ్ల రాకపోకలతో విధులకు అంతరాయం ఏర్పడినప్పుడు షెడ్‌లో 8 గంటల పని వేళలో ఆలస్యం కావడం వల్ల పని భారం పడుతోందని రైల్వే ట్రేడ్ యూనియన్ నాయకులు ఆరోపిస్తున్నారు. గతంలో షెడ్ వద్ద ఆర్‌యూబీ మంజూరైందని, ఏమైందో ఏమో గాని రద్దు కూడా అయిందని అంటున్నారు. షెడ్ కార్మికుల కోసం ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని రైల్వే జీఎం, డీఆర్‌ఎం, పీఎస్‌ఎం మీటింగ్‌తోపాటు రైల్వే బోర్డు స్థాయి వరకు వెళ్లిందని చెబుతున్నారు. ఇప్పటికైనా రైల్వే శాఖ బ్రిడ్జిని నిర్మించాలని షెడ్ రైల్వే నాయకులు, కార్మికులు కోరుతున్నారు.

తల్లిదండ్రులకు భారమైన శిశువు మృతదేహం

- ఎంజీఎం మార్చురీలో వదిలేసిన కన్నవారు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



ఎంజీఎం: ఎంజీఎం మార్చురీలో ఓ పసికందు మృతదేహాన్ని సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం మామిడాల గ్రామానికి చెందిన హైమవతి–అనిల్ దంపతులు వదిలివెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హైమావతి 7 నెలల గర్భిణి. కాగా, ఇటీవల తొర్రూరు ఆస్పత్రిలో శిశువుకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో శిశువుకు గుండె సమస్య ఉందని చెప్పడంతో అక్కడి నుంచి ఎంజీఎంలోని నవజాత శిశు కేంద్రానికి తీసుకొచ్చి చికిత్స చేస్తుండగా ఈనెల 8వ తేదీన మృతి చెందింది. కాగా, పసికందు మృతదేహాన్ని తల్లిదండ్రులు మార్చురీలో వదిలివెళ్లారా, డబ్బులు లేకపోవడంతో మున్సిపల్ సిబ్బంది ఖననం చేస్తారు అని వదిలివెళ్లారో తెలియదు. కానీ, గురువారం సాయంత్రం ఆస్పత్రిలో ఈ విషయం చర్చకు దారితీసింది. వెంటనే సమాచారం తెలుసుకున్న మట్టెవాడ పోలీసులు మార్చురీలో ఉన్న పసికందు మృతదేహం గురించి సదరు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం తల్లిదండ్రులు మరోసారి ఎంజీఎం మార్చురీకి రానున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు.

క్లుప్తంగా

పొగాకు ఉత్పత్తులు స్వాధీనం



రామన్నపేట: మట్టెవాడ పీఎస్ పరిధిలో నిషేధిత పొగాకు ఉత్పత్తులు(అంబర్ ప్యాకెట్లు) విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు వ్యాపారి కొలారియా ముకేశ్ ఇంటిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడులు చేశారు. ఈ మేరకు రూ.8.82 లక్షల విలువైన అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్, ఎస్సై టి.వీరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

13 నుంచి రోలర్ స్కేటింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: అండర్–5 నుంచి 18 బాలబాలికలకు ఈ నెల 13, 14వ తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు స్కేటింగ్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి సిద్దార్థ, ఓం ప్రకాశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలు 13వ తేదీన ఉనికిచర్లలో ఎస్‌ఎస్‌హౌస్ వద్ద, 14న రాంపూర్‌లోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ ఆవరణలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వివరాల కోసం 6301591754 నంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.

13,14వ తేదీల్లో వాగ్దేవిలో క్రీడాపోటీలు

మామునూరు: ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి క్రీడామైదానంలో ఈనెల 13,14 తేదీల్లో కాకతీయ యూనివర్సిటీ స్థాయి (ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల) క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల మేనేజ్‌మెంట్, ప్రిన్సిపాల్ సునీల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా పోటీల్లో 32 కళాశాలకు చెందిన డిగ్రీ, పీజీ , ప్రొఫెషనల్ కోర్సుల క్రీడాకారులు హాజరవుతున్నారని తెలిపారు. క్రీడా పర్యవేక్షకులుగా వాగ్దేవి కళాశాలల కార్యదర్శి సి.హెచ్.దేవేందర్‌రెడ్డి, సి.హెచ్.వాణిదేవి, డైరెక్టర్ సుదర్శన్‌రెడ్డి, ఆర్గనైజర్ సెక్రటరీ రామాంజనేయులు వ్యవహరిస్తారని ఆయన పేర్కొన్నారు.

బాంబు బ్లాస్టింగ్‌లో మునేశ్‌కు గాయాలు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో గురువారం జరిగిన బాంబు బ్లాస్టింగ్‌లో తాడ్వాయి మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన సీఆర్‌ఎఫ్ 195 బెటాలియన్ చెందిన ఆదివాసీ యువకుడు అలెం మునేశ్ తీవ్రంగా గాయపడ్డారు. దంతెవాడ జిల్లాలోని బార్సూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రావతి నది సమీపంలో బాంబులను వెలికి తీస్తున్నారు. ఈ క్రమంలో బాంబు పేలి మునేశ్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా, మునేశ్ త్వరగా కోలుకోవాలని భూపతిపూర్ గ్రామస్తులతోపాటు మండల ప్రజలు సోషల్ మీడియా ద్వారా దేవతలను వేడుకుంటున్నారు.